సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం, 20, మార్చి, 2023



కరుణించమ్మా.. నూకాలమ్మ


నాతవరం మండలంలో కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి పండగకు సర్వం సిద్ధం చేశారు. 8లో



నిండిన జలాశయాలు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండవాగుల నీరు జలాశయాల్లో చేరుతోంది. 8లో

దిగుబడి మెండుగా..



డుంబ్రిగుడ: మండలంలోని బోడుగుడలో పనసచెట్టు కాయలతో ఆకట్టుకుంటోంది. మొదలు నుంచి కాపుతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

న్యూస్‌రీల్

కారుపై కూలిన భారీ వృక్షం



యార్లగడ్డలో సర్పంచ్ వాహనంపై కూలిన చింతచెట్టు

వై.రామవరం: మండలంలో ఆదివారం తెల్లవారుజామున భారీగా కురిసిన గాలివానకు యార్లగడ్డలో సర్పంచ్ వల్లాల పద్మావతికి చెందిన బొలేరో వాహనంపై చింతచెట్టు కూలిపోయింది. వాహనం దెబ్బతింది. కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు ధ్వంసమయ్యాయి. ఈ సందర్భంగా బొలేరో వాహనం కొనుగోలు చేసి మూడు నెలలే అయ్యిందన్నారు. దీని వెనుక ఉన్న ద్విచక్రవాహనం కూడా పాక్షికంగా దెబ్బతిందన్నారు. జరిగిన నష్టాన్ని మండల రెవెన్యూ అధికారి దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

విద్యుత్ స్తంభంపై కూలిన చెట్టుకొమ్మ



ముంచంగిపుట్టులో విద్యుత్ స్తంభంపై చెలరేగిన మంటలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి స్థానిక బస్ షెల్టర్ సమీపంలోని విద్యుత్ స్తంభంపై మంటలు చెలరేగాయి. దీంతో పరిసర ప్రాంతీయులు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చెట్టు కొమ్మ విరిగి పడటంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని వారు తెలిపారు. తెగిపోయిన విద్యుత్ వైర్లను వెంటనే సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.

నిలిచిన పాపికొండలు పర్యాటకం

దేవీపట్నం: అల్పపీడన ద్రోణి కారణంగా వాతావరణశాఖ వర్ష సూచనలు జారీ చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాపికొండలు విహారయాత్రను నిలిపివేశారు. దీంతో పోశమ్మ గండి వద్ద బోట్లు ఒడ్డుకు పరిమితమయ్యాయి. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మూడు రోజులపాటు నిలిపివేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేసినట్టు పోశమ్మ గండి కంట్రోల్ రూమ్ సిబ్బంది తెలిపారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

ఎటపాక: వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ కోరారు. ఆదివారం గన్నవరంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ముంపు జాబితాలో ఎటపాక మండలాన్ని చేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ, సర్పంచ్ భద్రమ్మ, ఎంపీటీసీ కంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

బొర్రా వెలవెల



సందడి లేని బొర్రా గుహలు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలు వెలవెలబోయాయి. ఇంటర్ పరీక్షలు జరుగుతుండడంతో పాటుగా మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలోని మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకుల రాక తగ్గిపోయింది. ఈదురుగాలులకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడడంతో బొర్రాగుహలకు జనరేటర్‌తో సరఫరా చేశారు. ఆదివారం 500 మంది మాత్రమే తిలకించారు. కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ తదితర సందర్శిత ప్రాంతాలు పర్యాటకులు కళతప్పాయి.

బోసిపోయిన 'కొత్తపల్లి'

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతానికి వారం రోజుల నుంచి పర్యాటకులు తాకిడి తగ్గడంతో బోసిపోయింది. వీకెండ్‌లో తాకిడి ఎక్కువగా ఉండేది. ఆదివారం మైదాన ప్రాంతాల నుంచి పర్యాటకులు, సందర్శకులు రాలేదు. ఆదివాసీ గిరిజన మహిళలు ఏర్పాటు చేసుకున్న చీకులు, కబాబు దుకాణాలు కొనేవారు లేక వెలవెలబోయాయి.

వన్డేమాతరం

ఇండియా–ఆస్ట్రేలియా మ్యాచ్‌కు పోటెత్తిన ప్రేక్షకులు

టీంఇండియా ఓడినా క్రీడా స్ఫూర్తి చాటుకున్న అభిమానులు



స్టేడియంలో జాతీయ జెండాతో భారత్ జట్టు అభిమానులు

వన్డేమాతరం అంటూ విశాఖ అభిమానులు క్రికెట్‌కు జై కొట్టారు. భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్ అభిమానుల్లో పూనకాలు రప్పించింది. కలిసొచ్చిన మైదానంలో భారత్ బ్యాటర్లు భారీ స్కోరు చేస్తారని ఎదురు చూసిన అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. 117 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు వికెట్ కోల్పోకుండా ఓపెనర్లు భారీ షాట్లతో అలరించింది. గెలుపోటములు పక్కన పెడితే విశాఖలో క్రికెట్ గెలిచింది. అభిమానులను ఉత్సాహపరిచింది. వేలాది మంది అభిమానులు ఉప్పొంగేలా చేసింది.



బ్యాటింగ్ చేస్తున్న విరాట్ కోహ్లి



వర్షం తెరిపివ్వడంతో అభిమాని ఆనందం



బెట్ చేసిన ఆనందంలో ఆస్ట్రేలియన్ క్రికెటర్లు

జీవో నంబరు 3కు చట్టబద్ధత కల్పించాలి

యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి



మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

చింతూరు: గిరిజన ప్రాంతాల్లో వందశాతం పదోన్నతులు కల్పించేందుకు జీవో నంబరు 3కు చట్టబద్ధత కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి కోరారు. సంఘ జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం ఆదివారం చింతూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు తక్షణమే చెల్లించాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ఆయన కోరారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, పీఈటీ, లాంగ్వేజ్ పండిట్ల పోస్టులను అప్‌గ్రేడ్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా డిప్యూటీ వార్డెన్ పోస్టులను మంజూరు చేయాలని ఆయన కోరారు. యూటీఎఫ్ నాయకులు చింతూరులో ర్యాలీ నిర్వహించారు. కౌన్సిల్ సమావేశంలో 19 శాఖలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా చిట్టిబాబు, అధ్యక్షుడిగా విల్సన్‌బాబు, సహాధ్యక్షులుగా నాగేశ్వరరావు, కవిత, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరరావు, కోశాధికారిగా కృష్ణ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా కృష్ణయ్య, ఆదిరెడ్డి, రఘునాథ్, ధర్మారావు, వెంకటనారాయణ, దేముడు, రాజబాబు ఎంపికయ్యారు.

12,651 మందికి జగనన్న విద్యాదీవెన



విద్యాదీవెన నమూనా చెక్కును అందజేస్తున్న గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు

సాక్షి,పాడేరు: జగనన్న విద్యాదీవెన పథకంలో జిల్లాలోని 12,651 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరింది. ఈ మేరకు తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.4,96,67,000 నగదు జమఅయ్యింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో విద్యాదీవెన కార్యక్రమాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడేరు ఐటీడీఏలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగాన్ని విద్యార్థులు, తల్లులు వీక్షించారు. అనంతరం గిరిజన సంక్షేమశాఖ డీడీ ఎ.కొండలరావు విద్యార్థుల తల్లులకు రూ.4,96,67,000 విలువైన నమూనా చెక్కును పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్రైమాసానికి (అక్టోబర్, నవంబర్, డిసెంబర్)కు సంబంధించి జగనన్న విద్యా దీవెన నగదును ప్రభుత్వం జమచేసిందన్నారు. జిల్లాలో 1736 మంది బీసీ విద్యార్థులకు రూ.97లక్షల 47వేలు, 340మంది ఎస్సీ విద్యార్థులకు రూ.29 లక్షల 74వేలు, 11మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు రూ.లక్ష 28 వేలు, 48మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.3లక్షల 8 వేలు, ఎస్టీ విద్యార్థులు 10వేల 516మందికి రూ.3కోట్ల 65లక్షల 8వేలు వారి తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, పాడేరు ఏటీడబ్ల్యూవో ఎల్.రజని పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు

- తగ్గుముఖం పట్టని వర్షం
- స్తంభించిన జనజీవనం
- ఎటపాకలో అత్యధిక వర్షపాతం

సాక్షి,పాడేరు: జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టలేదు. శనివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం నెలకొంది. ఉదయం 11 గంటల వరకు పాడేరులో భారీ వర్షం కురిసింది. ఆ తరువాత తగ్గినప్పటికీ గాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మిరప పంటకు నష్టం జరగ్గా, కూరగాయలు, రబీ వరి పంటకు ఉపయోగకరమని జిల్లా వ్యవసాయాధికారి నందు తెలిపారు.

620.4 ఎంఎం వర్షపాతం నమోదు

జిల్లాలోని 22 మండలాల పరిధిలో ఆదివారం ఉదయం 620.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఎటపాకలో 62.4, అత్యల్పంగా హుకుంపేటలో 4.8 ఎంఎం నమోదైందని కలెక్టరేట్‌లో వాతావరణ విభాగం తెలిపింది. గంగవరంలో 58.6, రాజవొమ్మంగిలో 44.6, కొయ్యూరులో40.6, చింతూరులో 36.2, ముంచంగిపుట్టులో 36.4, వి.ఆర్.పురంలో 34.6, అడ్డతీగలలో 35.6, మారేడుమిల్లిలో 34.4, దేవీపట్నంలో 32.4, పెదబయలులో 31, వై.రామవరంలో 28.8, కూనవరంలో 28.2, రంపచోడవరంలో 24.4, అరకులోయలో 18.4, డుంబ్రిగుడలో 16.6, చింతపల్లిలో 15.2, జి.కె.వీధిలో 14.8, అనంతగిరిలో 8.2, జి.మాడుగులలో 7.4, పాడేరులో 6.8 వర్షపాతం నమోదైందని పేర్కొంది.

కొట్టుకుపోయిన 59 కొత్తూరుపాడు వంతెన

అడ్డతీగల: భారీ వర్షానికి కొక్కిరి గెడ్డ వాగు పొంగి ప్రవహించడంతో మండలంలోని 59 కొత్తూరుపాడు వద్ద వంతెన కొట్టుకుపోయింది. మండలంలోని 59 కొత్తూరుపాడు, ఏలేశ్వరం మండలం జెడ్డంగి అన్నవరం గ్రామాల మధ్యలో కొక్కిరి గెడ్డ వాగుపై 1992లో ఈ వంతెనను నిర్మించారు. వాగు పొంగినప్పుడల్లా వంతెనపైనుంచి ప్రవహిస్తుంది. వాగు ఉధృతికి తరచూ దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి నుంచి ఈ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగు పొంగడంతో వంతెనకు నష్టం వాటిల్లింది. దీంతో 59 కొత్తూరుపాడు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనంతగిరిలో ఈదురుగాలులతో..

అనంతగిరి: మండలంలోని శనివారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. భారీ వర్షం కారణంగా మండల కేంద్రం నిర్మానుష్యంగా మారింది. సాయంత్రం నుంచి ఈదురుగాలుల ప్రభావం ఎక్కువగా ఉంది. వర్షం కూడా తగ్గుముఖం పట్టలేదు. ఈదురు గాలులు, వర్షానికి కివర్ల పంచాయతీలో జీడిమామిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. పుతికపుట్టు గ్రామంలో బోడన్న రైతుకు చెందిన రెండు ఎకరాల్లో జీడిమామిడి చెట్లు నేలకొరిగాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో కాశీపట్నం గోస్తనీ నది ప్రవాహం పెరిగింది.



ఉప్పొంగి ప్రవహిస్తున్న కొక్కిరిగెడ్డ వాగు



అనంతగిరిలో కురుస్తున్న భారీ వర్షం



కొక్కిరిగడ్డ వాగు ఉధృతికి కొట్టుకుపోయిన వంతెన

'చిట్టి' మిస్సింగ్



అడవిని వీడి లక్కవరప్పాడులో చుక్కల జింక (ఫైల్)

రాజవొమ్మంగి: మండలంలోని లక్కవరప్పాడులో గ్రామస్తులతో మచ్చికగా ఉండే చుక్కల జింక (చిట్టి) వారం రోజులుగా కనిపించడం లేదు. ఆరు నెలల వయసులో అడవిని వీడి గ్రామంలోకి వచ్చిన దీనిని ఓ గిరిజన కుటుంబం చేరదీసింది. అప్పటినుంచి గ్రామస్తులతో కూడా మచ్చికగా ఉంటోంది. వన్యప్రాణిని పెంచడం అటవీ చట్ట ప్రకారం నేరం కావడంతో ఆశాఖ అధికారులు దీనిని స్వాధీనం చేసుకుని మారేడుమిల్లి అడవుల్లో విడిచిపెట్టారు. జనావాసాల్లో పెరగడం అలవాటు పడిన జింక రోడ్డుపైకి వచ్చి వాహనాలకు అడ్డంగా నిలబడేది. దీని ప్రాణానికి ప్రమాదం పొంచి ఉండటంతో అటవీ అధికారులు అక్కడి నుంచి లక్కవరప్పాడు తీసుకువచ్చి గ్రామస్తులకు అప్పగించారు. అప్పటి నుంచి గ్రామంలోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో వారం రోజులుగా కనిపించకపోవడంతో గ్రామస్తులు దిగులు చెందుతున్నారు. గతంలో అడవికి వెళ్లి నాలుగైదు రోజుల్లో వచ్చేదని, ఈ సారి కూడా అదేవిధంగా వస్తాదన్న ఆశతో గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

వెదురు కూర అదరహో..



తరిగిన వెదురును అమ్ముతున్న మహిళ

చింతూరు: మన్యంలో గిరిజనులు ఎంతో ప్రియంగా తినే వంటకం వెదురు కూర. ఈ ప్రాంతంలో దీనిని అందరూ వెదురు కోకిం కుసీర్ (వెదురు కూర)గా పిలుస్తారు. కూరగాయలు దొరకని రోజుల్లో నో వర్రీ మిందే (వుందిగా) వెదురు కర్రీ అంటూ వారంతా వెదురు కూరను భోజనంతో అధికంగా తినేవారు. అడవిలో వెదురు బొంగులు ఏర్పడడానికి ముందు లేత మొక్కలు (వెదురు కొమ్ములు) వస్తాయి. ఈ దశలో అవి భూమిలో నుంచి పైకి రాగానే వాటిని కట్‌చేసి పై పొరను తీసేసి శుభ్రంచేసి గోరువెచ్చని నీటిలో ఉడకబెడతారు. అనంతరం వాటిని క్యాబేజీ తురిమినట్లు సన్నగా తురిమి కారం, మసాలా దినుసులు కలిపి కూరగా వండుతారు. కొంతమంది వాటిని ఎండబెట్టి కొన్నిరోజుల తరువాత కూడా కూర వండుకుని తింటారు. ఇంగ్లీషు భాషలో వెదురు కూరను బాంబూ షూట్‌గా పిలుస్తారు. పొరుగునే ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గిరిజనులు వెదురు కొమ్ములను సేకరించి కొమ్ములుగా లేక సన్నగా తరిగి సంతల్లో విక్రయిస్తున్నారు. దీంతోపాటు ప్రస్తుతం వెదురు కొమ్ములతో పచ్చళ్లు కూడా తయారు చేసి పట్టణాల్లో గిరిజన స్టాళ్లలో విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



కాలిపోతున్న పూరిల్లు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆవాల ఎర్ర గుర్రయ్యకు చెందిన తాటాకిల్లు పూర్తిగా కాలిబూడిదైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. వారంతా పొలం పనులకు వెళ్లినట్టు ఇరుగుపొరుగు వారు తెలిపారు. గ్యాస్ స్టౌ నుంచి ఎగసిన మంటలు లేదా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ప్రమాదానికి కారణం అయి ఉండవచ్చని చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం సుమారు రూ.50వేలు ఉంటుందని, నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిండిన జలాశయాలు

రంపచోడవరం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీలో కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.రంపచోడవరం మండలంలోని భూపతిపాలెం, ముసురుమిల్లి జలాశయాల్లోకి నీరు చేరింది. అలాగే గంగవరం మండలంలోని సూరంపాలెం ప్రాజెక్టు, అడ్డతీగలల్లోని మద్దిగెడ్డ రిజర్వాయర్‌లో నీరు చేరింది. రెండు రోజుల నుంచి వర్షాలు పడడంతో జనజీవనం స్తంభించింది. ఆదివారం మధ్యాహ్నానికి వర్షం తెరిపివ్వడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్లు అరెస్టు



పేకాటరాయుళ్లతో ఎస్‌ఐ రంజిత్‌కుమార్

సాక్షి, పాడేరు: కిండంగి పంచాయతీ నక్కల పుట్టు గ్రామ సమీపంలో ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేసి, తొమ్మిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రంజిత్‌కుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్న తొమ్మిది నిందితుల నుంచి రూ.9020 స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని ఆయన తెలిపారు.

ఆగిన వర్షం.. అభిమానుల ఉత్సాహం



క్రికెట్ అభిమాని కేరింతలు



కిక్కిరిసిన స్టేడియం

సాక్షి, విశాఖపట్నం/విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ మ్యాచ్ అంటే ఎప్పుడో ఓ సారి వచ్చే పండగ. అలాంటి పండగ వచ్చిందంటే ఎలాంటి అవాంతరాలు రాకుండా మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించాలని ఆకాంక్షిస్తారు. సాధారణంగా ఈ మ్యాచ్‌లకు వరుణుడే ఆటంకాలు కల్పిస్తుంటాడు. అందుకే మ్యాచ్ జరిగే రోజు ఆయన కరుణించాలని కోరుకుంటారు. కానీ భారత్–ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్‌కు రెండురోజుల ముందు నుంచే వరుణుడు భయపెట్టాడు. శనివారం ఉదయం నుంచే చిరుజల్లులతో బెదిరించాడు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులు, కుండపోత వర్షంతో మరింత వణికించాడు. దీంతో అంతా క్రికెట్ మ్యాచ్‌పై ఆశలు వదులుకున్నారు. ఈ మ్యాచ్ ఇక వర్షార్పణమే అనుకున్నారు. వర్షం తగ్గుముఖం పట్టి క్రికెట్ మ్యాచ్‌కు ఆటంకం లేకుండా చూడాలని కోరుకున్నారు. వారి విన్నపాన్ని వరుణుడు కరుణించాడు. మధ్యాహ్నం 11 గంటలకు సూర్యుడు ఎండతో ప్రత్యక్షమయ్యాడు. ఫలితంగా ఒక్కసారిగా క్రికెట్ ప్రియుల ముఖాలు విప్పారాయి. ఇక ఆ తర్వాత వర్షపు ఛాయలే కానరాలేదు. మేఘాలు కమ్ముకున్నా వర్షించలేదు. దీంతో పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగే మ్యాచ్‌ను వీక్షించడానికి క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి చెందినా.. అభిమానులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి ఆటను ఆస్వాదించారు.

భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన రెండో వన్డేకు విశాఖతో పాటు శ్రీకాకుళం, ఒడిశా, జార్ఖండ్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు తరలివచ్చారు. క్రికెట్ అభిమానులతో ఆదివారం మధ్యాహ్నం నుంచే స్టేడియం కిక్కిరిసిపోయింది. ఇండియా గెలవాలంటూ అభిమానులు చేతిలో భారత్ జెండాలు పట్టుకుని.. ముఖాన మువ్వెన్నెల జెండా రంగులు అద్దుకొని నినదించారు. భారత్ టీ షర్టులు ధరించి స్టేడియం వద్దకు వచ్చి కేరింతలు కొట్టారు. అయితే అచ్చొచ్చిన స్టేడియంలో భారత్ బోల్తా కొట్టడంతో అభిమానులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. అడపాదడపా అభిమానులు కేరింతలు మినహా స్టేడియంలో ఎక్కువగా నిశ్శబ్దమే ఆవహించింది. ఇక మ్యాచ్ మొదలై.. పూర్తయినప్పటికీ స్టేడియం చుట్టూ భారీ సంఖ్యలోనే జనం గుమిగూడి కనిపించారు. ఇటు హనుమంతవాక నుంచి అటు మారికవలస వరకు రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సిబ్బందికి సూచనలిస్తూ.. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. అభిమానుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. ఇక బ్లాక్ టికెట్లను బహిరంగంగానే విక్రయించారు. విశాఖ జిల్లా తరఫున ఆడుతున్న అండర్–14, 16 జట్ల ఆటగాళ్లను ఏసీఏ ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి అభినందించారు. ఆంధ్రా తరఫున ప్రాతినిధ్యం వహించేస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వీరంతా ఈ మ్యాచ్‌కు బాల్ బాయిస్‌గా సేవలందించారు.

బోల్తాకొట్టిన భారత్

టాస్ ఓడిపోయి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 37 ఓవర్లలో కేవలం 117 పరుగులకే ఆలౌటైంది. కోహ్లీ 31, జడేజా 16 పరుగులు చేయగా అక్షర్ 29 పరుగులతో నిలవడంతో భారత్ ఆ మాత్రం స్కోర్ చేయగలిగింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా కేవలం 11 ఓవర్లలోనే వికెట్ పడకుండానే విజయం సాధించింది. విశాఖ పిచ్‌పై ఇంత భారీ తేడాతో భారత్ ఓడిపోవడం ఇదే తొలిసారి.

సందడి చేసిన హీరో నాని

విశాఖ స్పోర్ట్స్: భారత్–ఆసీస్ వన్డే మ్యాచ్‌లో భాగంగా స్టేడియంలో సినీ హీరో నాని సందడి చేశారు. తన సినిమా దసరా ప్రమోషన్‌లో భాగంగా కామెంటేటర్లు సునీల్ గావస్కర్, ఎంఎస్‌కే ప్రసాద్‌తో కాసేపు ముచ్చటించారు. సచిన్ ఆట అంటే తనకు ఇష్టమన్నారు. తను నటించిన పలు సినిమాల పేర్లను క్రికెట్లకు ఇస్తూ స్టేడియం నార్త్‌బ్లాక్‌లో సందడి చేశారు. రోహిత్ జెంటిల్‌మెన్, హార్దిక్ పాండ్య పిల్ల జమిందార్, కోహ్లీ గ్యాంగ్‌లీడర్ అంటూ టైటిల్ ఇచ్చారు. ఆసీస్ మాజీ క్రికెటర్ ఆరోన్ ఫించ్‌కు దసరాలోని ధూమ్‌ధామ్ సిగ్నేచర్ స్టెప్ నేర్పించి.. ఇద్దరూ కలిసి సరదాగా ఆ స్టెప్ వేశారు.



ఇండియా టీమ్‌కు స్వాగతం పలుకుతున్న సచిన్ వీరాభిమాని సుధీర్ కుమార్



బాంబు స్క్వాడ్ తనిఖీలు



మ్యాచ్ తిలకించేందుకు వచ్చిన ఆస్ట్రేలియన్లు













మ్యాచ్‌కు తరలివస్తున్న క్రికెట్ అభిమానులు

అనుమానస్పద స్థితిలో యువకుడి మృతి



చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ తాతారావు, ఇన్‌చార్జి ఎస్‌ఐ రామకృష్ణ

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లి గాంధీ వీధికి చెందిన జామి సింహాచలం నాయుడు (28) అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. దేవరాపల్లికి సమీపంలోని శారదానది ఒడ్డున రావి చెట్టు కొమ్మకు ఉరి వేసుకొని వేలాడుతున్న అతని మృతదేహాన్ని ఆదివారం తెల్లవారు జామున స్థానికులు గుర్తించారు. దీంతో స్థానికులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే అతని కుటుంబీకులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక సీఐ ఎస్. తాతారావు, ఇంచార్జ్ ఎస్‌ఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చెట్టుకు వేలాడి ఉన్న సింహాచలంనాయుడు మృతదేహాన్ని చూసి తల్లి సింహాచలమ్మ ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి కాలు నేలకు తాకి ఉండడంతో కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడి తల్లి సింహాచలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తాతారావు, ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. అవివాహితుడైన సింహాచలం నాయుడు సొంత ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడి తండ్రి ఇది వరకే మరణించగా, తల్లి సింహాచలమ్మ, వివాహితురాలైన అక్క, అవివాహితుడైన తమ్ముడు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచిన కుమారుడు అనుమానస్పద స్థితిలో మృతిచెందడంతో తల్లి, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

పిచ్చికుక్క హతం

బుచ్చెయ్యపేట: నాలుగు గ్రామాల్లో ప్రజలకు ఐదు రోజులుగా నిద్ర లేకుండా చేసి పలువురిని గాయపరిచిన పిచ్చికుక్క ఎట్టకేలకు హతమైంది. బుచ్చెయ్యపేట, దిబ్బిడి, ఐయితంపూడి, నేతవానిపాలెం గ్రామాల్లో పిచ్చికుక్క వీరవిహారం చేసింది. ఎదుట పడిన వారిని ఇంటి దగ్గరవున్న 30 మందిని గాయపరచడమే కాక పలువురు రైతుల పాడి పశువులు, కోళ్లు, గొర్రెలను కరిచి తీవ్రంగా గాయపరిచింది. గాయాలతో వచ్చిన పలువురిని బుచ్చెయ్యపేట వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి, చోడవరం ఏరియా ఆసుపత్రులకు తరలించారు. అర్ధరాత్రి మాటు వేసి పిచ్చికుక్కను హతమార్చారు.

కొత్త అమావాస్య జాతరకు సర్వం సన్నద్ధం

- జూన్లో అమ్మవారి గుడి చుట్టూ రూ.11 కోట్లతో రాతి నిర్మాణం
- నేడు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి గుడివాడ
- మీడియాతో నూకాంబిక ఆలయ ఈవో చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఆలయ ఈవో చంద్రశేఖర్

అనకాపల్లిటౌన్ : కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని నూకాంబిక అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో డి.చంద్రశేఖర్ తెలిపారు. గవరపాలెంలోని అమ్మవారి ఆలయ సమీపంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయం చుట్టూ రూ.11 కోట్లతో నిర్మించనున్న రాతి కట్టడం పనులు జూన్ 1న ప్రారంభించనున్నట్టు తెలిపారు. రూ.7 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేయగా, టీటీడీ నుంచి రూ.3 కోట్ల నిధులకు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు నూకాంబిక అమ్మవారికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వీవీఐపీ భక్తుల దర్శనాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయం ఎదురుగా తూర్పు దిక్కున 9 అంతస్తుల ఎత్తులో రాజగోపురం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 80, 81వ వార్డుల కార్పొరేటర్ల చొరవతో రూ.40 లక్షల నిధులు వెచ్చించి కొత్తగా మరుగుదొడ్లు నిర్మించనున్నట్టు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీవీఎంసీ వారిచే రెండు మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశామన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల రహదారులపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, నిత్యం పోలీస్ పర్యవేక్షణ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ మాట్లాడుతూ ఏప్రిల్ 19 వరకు నెల రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల భక్తులతో పాటు, పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, జాతరలో పాల్గొంటారని పేర్కొన్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జాతర రోజు రాత్రికి వచ్చే భక్తులకు అన్నసమారాధన, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ప్రతి మూడు గంటలకు శానిటైజేషన్ చేయనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా అమ్మవారి పండగను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆరు మాసాల క్రితం అసోం రాష్ట్రంలో నూకాంబిక అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నూతనంగా గుడిని నిర్మించినట్టు పేర్కొన్నారు. మెయిన్‌రోడ్డులో యూనియన్ బ్యాంక్ సహకారంతో ఏటీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గర్భిణులు, బాలింతలు అమ్మవారి దర్శనానికి ఇబ్బంది పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

హీటర్ ఆన్ చేసి.. మర్చిపోవడంతో...

రావికమతం: గుమ్మాళ్లపాడు గ్రామానికి చెందిన గొర్లె సత్తిబాబు ఇంటిలో విద్యుత్ ప్రమాదం జరిగి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఆయనకు రూ.20వేల ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. వివరాలివి. వేడి నీళ్లు మరిగించేందుకు ఎలక్ట్రిక్ హీటర్ వేశారు. ఆపై కరెంట్ పోవడంతో నీళ్లు తీసేసి హీటర్‌ను అలాగే మర్చిపోయి పొలానికి వెళ్లిపోయారు. కరెంట్ వచ్చాక హీటర్ నిప్పుల కొలిమిలా మండి టేబుల్ గ్రైండర్,కిచెన్‌లోని ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. ఇళ్లంతా పొగలు వాపించడంతో స్థానికుల సమాచారం మేరకు సత్తిబాబు ఇంటికి వచ్చి మరికొన్ని సమాగ్రిని రక్షించుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

'మీ ఖాతా నుంచి నగదు విత్ డ్రా అయింది...'

బుచ్చెయ్యపేట: బ్యాంక్ ఖాతా నుంచి తమకు తెలియకుండానే డబ్బులు విత్ డ్రా అవుతుండడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు. బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్టకు చెందిన కొట్యాడ మంగపతి బ్యాంక్ ఖాతా నుంచి రూ.14 వేలు, కడియం శ్రీను బ్యాంక్ ఖాతా నుంచి రూ.2,200 నగదు విత్ డ్రా చేసినట్టు రెండు రోజుల కిందట ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో శనివారం వీరు బ్యాంక్‌కు వెళ్లి వివరాలు అడగ్గా ఆధార్ కార్డు వేలిముద్ర ద్వారా నగదు విత్ డ్రా చేసినట్టు బ్యాంక్ సిబ్బంది తెలపడంతో వీరు ఖంగుతిన్నారు. తాము ఎక్కడా నగదు విత్ డ్రా చేయలేదని బాధితులు వాపోతున్నారు. అలాగే వడ్డాదికి చెందిన మెకానిక్ సుబ్రమణ్యం బ్యాంక్ ఖాతా నుంచి రూ.4వేలు నగదు విత్ డ్రా చేసినట్టు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వీరితో పాటు మరికొంత మందికి బ్యాంక్ నుంచి నగదు విత్ డ్రా చేయకుండానే నగదు విత్ డ్రా చేస్తున్నట్టు ఫోన్ మెసేజ్‌లు రావడంపై ఆందోళన చెందుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.

నేడు అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు

దేవీపట్నం: గొందూరు గ్రామంలో అఖండ గోదావరి నది ఒడ్డున ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయంలో హుండీను ఈ నెల 20 వ తేదీ ఉదయం 8 గంటలకు లెక్కింపు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ జి.వి.లక్ష్మీకుమార్ తెలిపారు. అమ్మవారి ఆలయంలో గల ఆరు హుండీలను దేవా దాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కరుణించమ్మా.. నూకాలమ్మ

- బుచ్చెంపేటలో కొత్త అమావాస్య పండగకు ప్రత్యేక ఏర్పాట్లు
- నేటి నుంచి హోమాలు, ప్రత్యేక పూజలు
- ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తుల రాక



అమ్మవారి ఎడమ భాగంలో ఏనుగు తొండం ఆకృతిలో నిర్మించిన వినాయక ఆలయం



బుచ్చెంపేటలో నూకాలమ్మ తల్లి

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి పండగకు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని జిల్లేడుపూడి పంచాయతీలో అమ్మవారి ఆలయం కలదు. ఏటా కొత్త అమావాస్యకు ఈ పండగను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఏ పనీ తలపెట్టిన ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రారంభిస్తే అవలీలుగా పూర్తవుతుందన్న అపారమైన నమ్మకం ఉంది. దాంతో స్థానికులతోపాటు ఉమ్మడి విశాఖపట్నం తూర్పుగోదావరి జిల్లాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజిస్తుంటారు. సోమవారం నుంచి ఆలయ ప్రాంగణంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఇనుప గ్రిల్ క్యూలైను, ప్రత్యేకంగా తాగునీరు, ప్రసాదం అందించేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు.

ఆలయ చరిత్ర ఇదీ!

ఇక్కడ నూకాలమ్మ తల్లి అమ్మవారు మొదట్లో అడవి ప్రాంతాన్ని తలపించే తోటల మధ్య మర్రిచెట్టు నీడలో కమ్మపాకలో ఉండేవారు. రాతి విగ్రహాలను అమ్మవారిగా స్థానికులు పూజించేవారు. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి వైజాగ్ స్టీల్ ప్లాంటుకు నీటిని తరలించేందుకు ఏర్పాటు చేస్తున్న ఏలేరు కాలువ పనుల్లో జిల్లేడుపూడిలో ఆటంకాలు ఏర్పడ్డాయి. ఎత్తయిన ప్రాంతం కావడంతో కాలువ తవ్వడానికి కుదరలేదు. దాంతో సొరంగం తీయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. అప్పట్లో దివంగత నేత ఎం. ప్రభాకర్ చౌదరి ముందుకు వచ్చాడు. ఆ సమయంలో ఒక వృద్ధుడు కనిపించి ముందుగా అమ్మవారిని దర్శించుకోవాలని సలహా ఇచ్చాడు. ఆ మాట ప్రకారం మరుసటిరోజు మర్రిచెట్టు పాదలో శిథిలమైన ఉన్న అమ్మవారి రాతి విగ్రహాన్ని దర్శించుకున్నాడు. కాలువ పనులు దిగ్విజయంగా పూర్తయితే ఆలయం నిర్మిస్తానని మొక్కుకున్నారు. ఆ ప్రకారం 1988లో సొంత నిధులతో సర్వాంగ సుందరంగా అమ్మవారి ఆలయం నిర్మించాడు. అమ్మవారికి కుడి వైపు 30 అడుగులు ఎత్తులో నాగసర్పంతో కూడిన శివలింగం, ఎడమ వైపు ఏనుగు తొండంలో కనిపించే విధంగా వినాయకుడి ఆలయం నిర్మించాడు. ఆంజనేయస్వామి, మహాలక్ష్మి అమ్మవారుతోపాటు పలు దేవుళ్ల విగ్రహాలు నవగ్రహాలు ఏర్పాటు చేశాడు. అప్పట్నుంచి ఉగాదికి భారీ స్థాయిలో జిల్లేడుపూడి గ్రామస్తులు అమ్మవారి పండగ చేస్తున్నారు.